# సాంప్రదాయం

ముళ్ళపూడి శేష్‌కుమార్
ఆర్.బి.యస్.ప్రసాద్



పెరుమాళ్ళు కొత్తగా చిత్రసీమలో పాదం మోపిన నిర్మాత. పిల్లలు లేని దూరపు బంధువొకాయన పరలోకానికి టిక్కెట్టు పుచ్చుకొంటూ... తనకున్న యావదాస్థిని ఏంచెయ్యాలో తోచక... ఆ సమయానికి పక్కనే ఉన్న పెరుమాళ్ళు పేరని రాసి మరణించాడు.

పేకాట, తాగుడూ, రేసులూ లాటి అలవాట్లు లేని పెరుమాళ్ళుకి అలా అనుకోకుండా కలిసి వచ్చిన ఆస్థిని ఏం చెయ్యాలో తోచలేదు. అతగాడిది బట్టతల కావడంతో, జుట్టుపీక్కుని ఆలోచిద్దామన్నా లాభం లేక పోయింది. ఎట్టకేలకు ఫ్లాష్‌లా అతడి మస్తిష్కంలో 'సినిమా' మెదిలింది. వెంటనే ఆ డబ్బుతో సినీ నిర్మాతగా మద్రాస్‌లో అవతారమెత్తాడు. అతడికి చిన్నప్పటినుండీ... చిన్న పిల్లల పత్రికల్లో వచ్చే రాజుల కథలు చాలా ఇష్టం అవడంతో స్నేహితుడి సహాయంతో ఓ ఫేమస్ డైరక్టర్ని ఒప్పించి... భారీగా జానపద వర్ణ చిత్రం తీయడానికి కావలసిన హంగులన్నీ పూర్తి చేసు కొన్నాడు. అదృష్టం బాగుండి, 'జానపద సామ్రాట్'గా వెలుగొందుతున్న హీరో కూడా, పెరుమాళ్ళు తీయ బోయే 'శవాల కోట' సినిమాలో నటించడానికి ఒప్పు కొని కాల్షీట్స్ ఇచ్చాడు. దాంతో పెరుమాళ్ళు ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.

సినిమాలో కథ లేకపోయినా నష్టం లేదు— గొప్ప నటవర్గం లేకపోయినా బాధలేదు— రేప్‌సీన్లు, కరాటే సీన్లు పెట్టకపోయినా పర్వాలేదు — కానీ షూటింగ్‌ను మంచి ముహూర్తంలో ప్రారంభించకపోతే మాత్రం సినిమా 'అట్టర్‌ఫ్లాప్' అవుతుందనేది "సినిమా నమ్మకం"! ఆ నమ్మకాన్నే నమ్మి మంచి ముహూర్తం చూసుకొని షూటింగ్ ప్రారంభించాడు పెరుమాళ్ళు. అనుకున్నదాని కన్నా... కొస్త ఎక్కువగా ఖర్చవుతున్నా, అవరోధాలు లేకుండా షూటింగ్ సాగిపోతోంది.

అది షూటింగ్ చివ్వరోజు. యువరాజు వేషంలో వున్న హీరోగారు సమస్త ఆభరణలతో అలంకరింపబడి పట్టాభిషిక్తుడయే సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. అలాటి పాత్రలూ... సన్నివేశాలూ... హీరోగారికి నల్లేరు మీద నడక వంటిదీ, పెట్టిన పిండిలాంటిది కావడం వల్ల అవలీలగా నటించేసి ఫస్ట్ షాట్‌లోనే సీన్ని ఓకే చేశాడు. అసలు డ్యూయెట్ సీన్‌లకి తప్పితే మిగతా సీన్‌లకు సెకండ్ టేక్ ఛాన్స్ వచ్చినా ఇవ్వడు హీరోగారు.

షూటింగ్ అయిపోగానే— "మా 'శవాల కోట' ఇంత గొప్పగా రావడానికి మీరు చేసిన సహాయం మర్చిపోలేనండి!" అంటూ హీరో వద్దకు వెళ్ళి తన తర్వాత సినిమాకు కూడా హీరోగారు కాల్షీట్లు ఇవ్వడానికి సరిపడా 'వాజ్‌లైన్' రాయసాగాడు పెరుమాళ్ళు

హీరోగారు విగ్గు సవరించుకొంటూ— "దాందే ముందండీ... అది మా విధి!" అంటూ సినిమాలో ఊరికే నటించినట్లుపోజు పెట్టి, "ఇక వస్తా!" నంటూ ఫుల్ మేకప్‌తోనే కారు ఎక్కేసాడు.

పెరుమాళ్ళు కళ్ళు జైంట్‌వీల్‌లా గిర్రున తిరిగాయి. "అదేంటయ్యా డైరెక్టూ! ఎంతో కష్టపడి...ముందు తీయబోయే సినిమాలకు కూడా పనికి వచ్చేట్లుగా యాభై వేలు తగలేసి, ఆభరణాలు దగ్గరుండి డిజైన్ చేయించుకొన్నాము. అలాటివి ఇప్పుడు కావాలన్నా దొరకవు. అవన్నీ అలా ఒంటి మీదే ఉంచేసుకొని... కారెక్కేశాండేంటయ్యా హీరో—" అంటూ లబో దిబోమన్నాడు.


"అయ్యో... అందంతేనండీ! షూటింగ్ అయి పోయేసమయానికి ఆయనవంటి మీదా... చేతు ల్లోనా... ఏదుంటే దాన్ని అలాగే ఉంచేసుకొని కారె క్కేస్తాడండీ! మొన్నీ మధ్య ఓ సినిమాలో చివరి బిట్‌గా హీరోయిన్ని ఈ హీరోగారు ఆనందంతో భుజం మీదకు ఎత్తుకొనే సీన్ తీశారు. ఫినిష్...! సీన్ అయిపోగానే, ఆవిడ్నలాగా భుజం మీదుంచేసుకొని కారెక్కేసాడండీ! ఆ హీరోయిన్ మదర్ కమ్ గార్డియన్ లబోదిబోమంటున్నా లాభంలేకపోయింది. అసలిదాయన సాంప్రదాయమండీ!" అంటూ పళ్ళికిలించుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు డైరక్టర్.

"సాంప్రదాయమా! చూస్తా!" అంటూ పళ్ళు కొరుకుతూ... ఓ పది నిమిషాల తర్వాత హీరోకి ఫోన్ చేశాడు పెరుమాళ్ళు.

"హీరోగారూ! క్షమించాలి! ఇవాళ తీసిన సీన్లో ఒక బిట్ సరిగా రాలేదుట! మళ్ళీ తీయాలంటున్నాడు డైరక్టరు. తమరు రేపొక్కసారి వస్తే... అలాగే... తప్పకుండా... డబ్బేగా... వెంటనే పట్టుబట్టల్లో పంపిస్తా! కానీ తమరు మాత్రం ఇవాల్టి మేకప్ తోనే రావాలి... అలాగే... ఉంటా!" అంటూ హీరోను ఒప్పించి ఫోన్ పెట్టాశాడు.

మర్నాడు హీరోగారు మేకప్‌తో కారు దిగారు. పెరుమాళ్ళు ఎదురెళ్ళి..." ఇబ్బంది పెట్టినందుకు


## స్వపరిచయం



హైదరాబాద్‌లోని ప్రాంతీయ పరిశోధనాలయం లో సైంటిస్ట్‌గా ఉద్యోగం. పాప్యులర్ సైన్స్ వ్యాసాలు వివిధ పత్రికలకు వ్రాయడం, రేడియో కార్యక్రమాలు ఇవ్వడం ముఖ్యమైన హాబీలు. ఇప్పటికి ఓ డజను దాకా కథలు ప్రచురణకు నోచుకున్నా... బహుమతంటూ రావడం ఇదే ప్రథమం. ఇది మా జంట మలి కథ.

—ఆర్.బి.ఎన్. ప్రసాద్,
హైదరాబాద్

✻



సంపాదించుకోడానికి సరిపడా చదువు! హాయిగా బతికేయడానికి సరిపడా ఉద్యోగం! రేడియో నాటకాలూ, కార్టూన్స్‌కీ అలవాటు పడ్డ కలం ఈ మధ్యే 'కథ'న రంగంలో కురికింది. మనసులో దిగుళ్ళు, బాధల్ని మర్చిపోయేలా చేయగల హాస్యం అంటే అమితిష్టం. హాస్యాలాడే ఎవ్వరైనా ఇష్టమే.

—ముళ్ళపూడి శేష్‌కుమార్,
హైదరాబాద్

క్షమార్పణ చేప్పుకొన్నాడు. వెంటనే కెమెరాలో ఫిల్మ్ లేకుండా ఓ చిన్న బిట్ షూట్ చేయించాడు.

"ఇకమేం... వెళ్ళొచ్చా!" అడిగాడు హీరో.

"ఒక్క పది నిమిషాలు! మీరు బిచ్చగాడి వేషంలో రాణీ వాసంలోకి ఎంటరయ్యే సీన్‌కూడా సరిగ్గా రాలేదట, కాస్త మీరు బిచ్చగాడి వేషం వేసుకుంటే..." అంటూ నసిగాడు పెరుమాళ్ళు.

హీరో చిరాగ్గా మొఖం పెట్టి..." ఇవన్నీ ముందరే చూసుకోవాలండీ! కొత్త వాళ్ళకి కాల్షీట్స్ ఇస్తే ఇలాగే ఉంటుంది!" అంటూ విసురుగా మేకప్ రూంలోకి వెళ్ళి మేకప్ మార్చుకున్నాడు.

మళ్ళీ కెమెరాలో ఫిల్మ్ లేకుండా షూటింగ్ ముగిసింది.

"ఇకవస్తాం!" అంటూ కారువైపు బయలు దేరిన హీరో తన డ్రస్‌వంక చూసుకొని హఠాత్తుగా ఆగిపోయి వెనక్కి చూశాడు. మేకప్ రూంలో అతడు వదిలిన ఆభరణాల్ని మూటకట్టుకొనే హడావుడిలో ఉన్నాడు పెరుమాళ్ళు. అప్పటికి గానీ... తాను గోతిలో పడ్డ సంగతి తెలియలేదు... పాపం... ఆ హీరోకి!

